క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ముడుపుల సేవ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మెంటాడ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముడుపుల సేవ గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామి వారికి ముడుపులు చెల్లించి, మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 'పారాది' విద్యార్థులు



పోటీలకు పయనమైన విద్యార్థులతో పీడీ వెంకటనాయుడు

బొబ్బిలిరూరల్: జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని పారాది గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పయనమయ్యారు. మహారాష్ట్రలోని జెల్‌గ్రామ్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో పాల్గొనేందుకు బెల్లాన సుప్రియ, భువనేశ్వరిలు బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కారు. అలాగే అదే పాఠశాలకు చెందిన అల్లాడ చైతన్య, చైతన్యకుమారి, దుర్గ, యమున, మౌనికలు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగే సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వెళ్లారు. జాతీయ పోటీల్లో కూడా బాగా రాణించి, మంచి పేరు తీసుకురావాలని పీడీ వెంకటనాయుడు, పాఠశాల సిబ్బంది ఆకాంక్షించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



బొబ్బిలిరూరల్: తహసీల్దారుకు సమస్య వివరిస్తున్న రైతు

తెర్లాం/బొబ్బిలిరూరల్/బాడంగి: మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ల దృష్టికి రైతులు తమ భూ సమస్యలు తీసుకువచ్చి, పరిష్కరించాలని కోరారు. భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు కోరారు.

భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో ఆర్డీవో రామ్మోహనరావు తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ గురువారం చేపట్టారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆర్డీవో జేవీ రామ్మోహనరావు పాల్గొని, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామగ్రామాన నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్యాంకర్లు సహకరించాలి

బాడంగి: రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో గురువారం సమావేశమైన ఆయన.. ఈ ఏడాదిగాను మండలానికి 71 బీసీ, 1 ఈబీసీ రుణ యూనిట్లు మంజూరు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, బ్యాంకర్లు తప్పకుండా గ్రౌండింగ్ చేసేలా చూడాలని కోరారు. ప్రతీ పంచాయతీకి 3 యూనిట్లు చొప్పున 25 పంచాయతీలకు అవకాశం కల్పించాలన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవాలు

బొబ్బిలి: సీపీఐ ఆవిర్భవించి, వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక పట్టణంలో సీపీఐ శత వార్షికోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల ప్రయాణంలో ఎన్నో ప్రజాపోరాటాలు సాగించిందన్నారు. కార్మికులు, కర్షకులకు అండగా నిలిచి, బ్రిటిష్ పాలకులను సైతం ఎదిరించిన ఏకైక పార్టీ సీపీఐ అని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లింపులు..
అంతంతమాత్రమే!

- ముగిసిన పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు
- ప్రీమియం చెల్లింపుల్లో 23.2 శాతంతో చివరి స్థానంలో రామభద్రపురం
- రైతులకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం
- నష్టపోతున్న రైతాంగం

రామభద్రపురం: వర్షాభావ పరిస్థితులు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ కలిసి రాకపోగా ప్రస్తుతం రబీ సీజన్ సైతం అనుకూలంగా లేదనే అసంతృప్తి అన్నదాతల్లో నెలకొంది. ఇలాంటి సమయాల్లో అండగా నిలవాల్సిన ప్రభుత్వం కూడా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. రైతు సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో అన్ని వర్గాల నుంచి ప్రభుత్వ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం ఏకంగా రూ.20 వేలు చెల్లిస్తామంటూ నమ్మబలికిన కూటమి పెద్దలు ఖరీఫ్ సీజన్ పోయి రబీ సీజన్ ఆరంభమైనా ఆ ఊసే ఎత్తడం లేదు. ఇదిలా ఉంటే గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్నికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడేసి, పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని చెబుతూ అన్నదాతపై పెనుభారం మోపింది. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌లో పండిస్తున్న మొక్కజొన్న, వేరుశనగ, ఉల్లి, టమాటా, వరి పంటలకు రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా వర్తిస్తుందని చంద్రబాబు సర్కారు స్పష్టం చేసింది. గురువారంతో ప్రీమియం చెల్లింపు గడువు కూడా ముగిసింది. అయితే నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, తెర్లాం మండలాలు మినహా రామభద్రపురం మండలంలో అంతంత మాత్రమే ప్రీమియం చెల్లింపులు జరిగినట్లు అధికారిక సమాచారం. ప్రీమియం చెల్లింపులపై అధికారులు కూడా అంతగా అవగాహన కల్పించకపోవడంతోనే రైతులు చెల్లింపులు చేసుకోలేకపోయారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చివరి స్థానంలో రామభద్రపురం..

నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి మండలాల్లో 100 శాతం మంది రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించగా, తెర్లాం మండలంలో 80.1 శాతం మంది రైతులు, రామభద్రపురం మండలంలో 23.2 శాతం మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా బీమా ప్రీమియం చెల్లించనిది కొంతమంది అయితే బీమా ప్రయోజనాలపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో మరికొంతమంది ప్రీమియం చెల్లించలేదన్న వార్తలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా రైతుకే నష్టం జరిగేలా అటు అధికారుల పనితీరు.. ఇటు ప్రభుత్వ తీరు ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్షేత్రస్థాయిలో అవగాహన లేదు..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. ఉచిత పంటల బీమా పథకం ప్రవేశపెట్టి, పంట నమోదు ఆధారంగా సాగు విస్తీర్ణం అంతటికీ రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వచ్చింది. దీంతో చాలామంది రైతులకు పంటల బీమా ప్రీమియం ఇప్పుడు రైతులే చెల్లించాలన్న విషయం తెలియని పరిస్థితి నెలకొంది. వ్యవసాయాధికారులు కూడా రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడంలో అలసత్వం వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి, పంటల వారీగా బీమా ప్రీమియం చెల్లింపులు ఏ మేర జరుగుతున్నాయి.. ఏయే పంటకు ఎంత ప్రీమియం చెల్లించాలి, ఎప్పటిలోగా చెల్లించాలి, ప్రీమియం చెల్లించడం ద్వారా పొందే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. ఎక్కడా కూడా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఇలా అవగాహన కల్పించిన దాఖలాలు లేవని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడైనా ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగితే రైతులు పరిహారం కోల్పోయే ప్రమాదం లేకపోలేదు.



సాగులో మొక్కజొన్న పంట

గతంలో మాదిరి అమలు చేయాలి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన మాదిరిగానే ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని రైతులంతా విజ్ఞప్తి చేస్తున్నారు. సాధారణ రైతులతో పాటు గుర్తింపుకార్డు పొందిన కౌలురైతులకు కూడా పూర్తిస్థాయి పరిహారం అందించేవారు. ఇప్పుడు ఆ సదుపాయం లేకపోవడంతో అటు సాధారణ రైతాంగం ఇటు కౌలురైతాంగం కూడా తీవ్రంగా నష్టపోనున్నారు.



మామిడి రైతుకు బీమా ప్రీమియం చెల్లించాలని అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖాధికారి మోహనహనకృష్ణ

పరిశీలించి, వేగవంతం చేయిస్తాం..

నెట్‌వర్క్ సరిగా లేక బుధవారం సాయంత్రం నుంచి సైట్ సరిగా పనిచేయడం లేదు. నియోజకవర్గంలో మిగిలిన మండలాల కన్నా రామభద్రపురం మండలం బాగా వెనకబడి ఉండడం వాస్తమే. అక్కడి వ్యవసాయాధికారి రైతులకు అవగాహన కల్పించడంలో అలసత్వం, క్షేత్రస్థాయిలో పరిశీలనలో నిర్లక్ష్యం చేసి ఉండొచ్చు. పంటల బీమా ప్రీమియం గడువు పొడిగించే అవకాశం ఉంది. స్వయంగా పరిశీలించి, ప్రక్రియను వేగవంతం చేయిస్తా.

– శ్యామ్‌ప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడీ, బొబ్బిలి

ఎమ్మెల్సీగా మరో అవకాశం కల్పించండి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీనివాసులునాయుడు

బాడంగి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మరోసారి తనకు అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల సహా కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించి, అక్కడి ఉపాధ్యాయులను కలిసి తనకు ఓటు వేయాలని కోరారు. గెలిచిన ఆరు నెలల్లో సర్వీస్ రూల్స్ అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే 117 జీవో రద్దు అయ్యేలా చూస్తానన్నారు. ఆయన వెంట పీఆర్‌టీయూ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు వాలేటి తవిటినాయుడు, ఆప్టా జిల్లా అధ్యక్షుడు బొక్కేన రాము, రాష్ట్ర కార్యదర్శి చింతా రమణ, మండల సంఘ అధ్యక్షుడు అల్లు రామారావు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సంతకవిటి: వాల్‌పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, సభ్యులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) క్యాలెండర్‌తో పాటు ఆ సంఘ స్వర్ణోత్సవాల మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆ సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు బూరాడ శ్రీనివాసం, దోల కృష్ణారావు, శాసపు బాబూరావులు గురువారం ఆవిష్కరించారు. కాకినాడలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే స్వర్ణోత్సవాల మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సూర్య దినపత్రిక రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం

సంతకవిటి: స్థానిక కూరాకుల వీధిలోని క్రైగ్ ఇమ్మానుయేల్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ పి.ఫెలిక్స్, భాగ్యలక్ష్మి, సంఘ సభ్యులంతా రాజాం మండలంలోని కొండంపేట అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం గురువారం చేశారు. అనంతరం సారథి రోడ్డులోని చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించి, అక్కడి వారికి భోజన సౌకర్యం కల్పించడంతో పాటు బిస్కెట్ ప్యాకెట్లు పంచిపెట్టారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని, ఈ సేవా కార్యక్రమాలు చేశామని వారు తెలిపారు.

చిన్నారులకు వ్యాక్సిన్లు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, కేఎంవలస, చాటాయివలస, రేగిడి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమం గురువారం చేపట్టారు. వైద్యారోగ్య సిబ్బంది చిన్నారులకు వ్యాక్సిన్లు వేయడాన్ని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటి వ్యాక్సిన్లు అప్పుడే వేయాలని తెలిపారు.


క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ క్కరూ తమవంతు కృషి చేయాలని తహసీల్దారు సులోచనరాణి కోరారు. వంద రోజుల టీబీ నిర్మూలన ప్రణాళికలో భాగంగా మండలంలోని నర్సాపురం, దుప్పలపూడి గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు దగ్గు, జ్వరం, ఛాతిలో నొప్పి, అలసట, నీరసం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే పీహెచ్‌సీలో టీబీ నిర్ధారణ కోసం కెల్ల పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ ఈవో మల్లికేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ పద్మలత, టీబీ సూపర్‌వైజర్ ఆర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అపరాల పంటల పరిశీలన



నాయిరాలవలసలో అపరాల పంటను పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని తోకలవలస, అంబఖండి, పనసలవలస, బూరాడ, నాయిరాలవలస, ఉంగరాడ తదితర గ్రామాల్లో రబీ సాగులో భాగంగా పండిస్తున్న అపరాల పంటలను ఏవో జి.మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. మినప పంట పూత దశలో ఉందని, రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మంచు ప్రభావం అధికంగా ఉండడంతో పూత పాడయ్యే అవకాశం ఉందని, తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

ఎరువుల తయారీపై అవగాహన

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పరిశీలించారు. అక్కడి సిబ్బందికి ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. చెత్త నుంచి ఎరువు తయారు చేసి, సబ్సిడీపై రైతులకు ఇచ్చి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్

రాజాం సిటీ: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొఠారిపురంలో మత్తుపదార్థాలు వాటి దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం, సారా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై ఎంతోమంది యువత, విద్యార్థులు తమ అందమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సంక్రాంతి పండగ వేళ గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై నిఘా ఉంచాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై శిక్షణ

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం శిక్షణ ఇచ్చారు. ప్రమాదాల నివారణలో కీలకమైన ఐరాడ్, ఈడార్ విధానాలను శిక్షణార్థులకు నేర్పించారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఈ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శిక్షణ కో–ఆర్డినేటర్ శ్రీధర్, పట్టణ సీఐ కె.సతీష్‌కుమార్, రూరల్ సీఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగిడి: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు రాజాం ఏడీఈ ఫణికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ అసౌకర్యం ఉంటుందన్నారు.

వంగర: మండలంలోని కింజంగి సబ్‌స్టేషన్ పరిధిలోని సీతాదేవిపురం ఫీడర్ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు తెలిపారు. సీతాదేవిపురం, మరువాడ, ఇరువాడ, చంద్రంపేట తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంతకవిటి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని గరికిపాడు ఫీడర్ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. గరికిపాడు, తాలాడ, కృష్ణంవలస, శ్రీహరినాయుడుపేట, కొండగూడేం, మాధవరాయపురం తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నీటి సరఫరాలోనూ..

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాలకొండ రోడ్డులోని కేర్ ఆస్పత్రి జంక్షన్ వద్ద పైపులైన్ మరమ్మతులకు గురైన విషయం తెలిసిందే. అయితే ఆ పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గొయ్యి పక్కనే ఉన్న విద్యుత్‌స్తంభం ప్రస్తుతం పడిపోయే దశలో ఉంది. విద్యుత్ శాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో మళ్లీ ఆ గోతిని పూడ్చామని, విద్యుత్ శాఖ అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చిన తర్వాత ప్రధాన పైపులైన్ షిఫ్టింగ్ చేసినంత వరకు నీటి సరఫరాకు అంతరాయం తప్పదన్నారు. శ్రీకాకుళం రోడ్డు, సారధి ప్రాంతాలకు మినహా మిగిలిన ప్రాంతాల్లో నీటి సరఫరా నిలుపుదల చేయనున్నామన్నారు.

ఆక్రమణలు తొలగించండి



రాజాం మండలం, కంచరాం గ్రామ ఇద్దుమాని చెరువు ఆక్రమణకు గురవుతోందని, అక్కడి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు ఎస్.కె.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయకట్టు పొలాలకు సాగు నీరు అందేలా చూడాలని, చెరువులోని ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

–రాజాం

కుచించుకుపోతున్న ఏకేఎల్ గెడ్డ



రేగిడి మండలంలోని ఉనుకూరు నుంచి ఆమదాలవలస వరకు విస్తరించి ఉన్న ఏకేఎల్ గెడ్డ.. వెంకంపేట వద్ద కుచించుకుపోతోంది. ప్రధానంగా చేపల చెరువుల కారణంగా కాలువను ఆక్రమిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 200 మీటర్ల వెడల్పు ఉండే ఈ గెడ్డ.. ప్రస్తుతం 50 మీటర్లు వెడల్పుగా ఉంది. ఫలితంగా కాలువకు గండ్లు పడి సమీప గ్రామాలు, పొలాలను ముంచేస్తోంది. కాలువ భాగంలోని ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఇదే గెడ్డ నుంచి 6 వేల ఎకరాలకు సాగు నీరు సరఫరా అవుతోంది.

–రేగిడి

మామిడికి మంచు ముప్పు



మామిడి పంటకు మంచు ముప్పు తప్పేలా లేదు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా దట్టంగా కురుస్తున్న పొగమంచు మామిడి పూతను దెబ్బతీస్తోంది. సంతకవిటి మండలంలోని శ్రీహరినాయుడుపేట వద్ద ఉదయాన్నే ఇలా మామిడి పంటపై కురుస్తున్న మంచు అక్కడి రైతులను ఆందోళనలోకి నెట్టేసింది. ఇదే కొనసాగితే పూత అస్సలు ఉండదని, ఫలితంగా పంట చేతికి రాదని రైతులు వాపోతున్నారు.

–సంతకవిటి

సర్వేను వేగవంతం చేయండి



బొద్దాం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం, సోపేరు తదితర గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈకేవైసీ నమోదుతో పాటు హౌస్ హోల్డ్ జియో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు.

వాహన తనిఖీలు

వంగర: మండల కేంద్రంలో వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను పరిశీలించారు. ఎస్‌ఐ షేక్ శంకర్ మాట్లాడుతూ వాహనదారులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.